సాక్షి అనంతపురం

సోమవారం, 30, జూన్, 2025



అధికార అండ.. మట్టి దందా

డి.హీరేహాళ్ మండలం దొడగట్ట చెరువులో కొన్ని రోజులుగా భారీఎత్తున మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. 8లో



మద్యం మత్తునే హత్యకు కారణం

అనంతపురంలో ఇటీవల కలకలం రేపిన ఓ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.7°/21.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు.రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలని సూచించారు. అర్జీలో ఆధార్, ఫోన్ నంబర్లు పొందుపరచాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏ క్షణంలోనైనా తుంగభద్ర తుళ్లింత

- డ్యాంలో ఇప్పటికే 68 టీఎంసీల నీరు
- 65,182 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి ఏ క్షణంలోనైనా నదికి నీరు విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద పోటెత్తి డ్యాంలో నీటి మట్టం భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం 65,182 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాంలో గరిష్ఠ నీటి నిల్వ 68 టీఎంసీలకు పైగా చేరింది. క్రస్ట్ గేట్లు బలహీనంగా ఉన్న నేపథ్యంలో కేవలం 80 టీఎంసీల నీరు నిల్వ ఉంచాలని ఇటీవల అధికారులు తీర్మానించారు. ఈ నేపథ్యంలో ఆ మేరకు నీరు చేరితే ఏ క్షణంలోనైనా దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. నదీ తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే అధికారులు హెచ్చరించారు.

ఇదెక్కడి ప్రజాస్వామ్యం?

- జాతీయ సదస్సుకు మేయర్లకు ఆహ్వానం ఏదీ?
- అనంతపురం మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: వచ్చే నెల 3, 4 తేదీల్లో హర్యానాలోని గురుగ్రామ్‌లో 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం, జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై జరిగే జాతీయ సదస్సుకు వైఎస్సార్ సీపీ మేయర్లు, డిప్యూటీ మేయర్లకు ఆహ్వానం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు పాల్పడిందని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని అనంతపురం నగర మేయర్ వసీం ప్రశ్నించారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేయర్, డిప్యూటీ మేయర్లకు ఈ సదస్సుకు తప్పక అవకాశం ఇవ్వాలని కేంద్రం ఆదేశించినా..సీఎం చంద్రబాబు నియంతృత్వ పోకడతో రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తమను కాదని, టీడీపీకి చెందిన వారికి మాత్రమే అవకాశం ఇవ్వడం శోచనీయమన్నారు. అనంతపురంతో పాటు విజయవాడ, కడప, తిరుపతి మేయర్లకు ఆహ్వానం అందకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



కల్తీల కలవరం







- నీళ్ల నుంచి పాల వరకు అన్నీ కల్తీ
- తాజాగా గుడ్‌నైట్, ఏరియల్ వస్తువులు నకిలీ
- గతంలో బ్రూ ప్యాకెట్లు, టైడ్ పౌడర్లు ఫేక్‌గా తేలాయి
- ఒరిజనల్ ఏదో నకిలీ ఏదో కనిపెట్టలేక మోసపోతున్న జనం
- విజిలెన్స్ తనిఖీల్లో గుట్టు రట్టుతో వినియోగదారుల్లో ఆందోళన

- అనంతపురంలోని పాతూరుకు చెందిన మహబూబ్ బాషా దోమలబారినుంచి తప్పించుకునేందుకు ఆలౌట్ లిక్విడ్ బాటిల్ కొన్నారు. దోమలు చావకపోగా ఎన్ని రోజులైనా లిక్విడ్ అయిపోలేదు. అప్పుడు తెలిసింది ఇది నకిలీ ఆలౌట్ అని.
- గుత్తిలో సుజాత అనే మహిళ అర డజను బట్టల సబ్బులు కొనింది. కానీ ఆ సబ్బుతో ఎంత ఉతికినా మురికి పోలేదు. చివరకు ఆరా తీస్తే అవి నకిలీవని తేలింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మార్కెట్ నిండా నకిలీ, కల్తీ వస్తువులే. సామాన్యులు, నిరక్షరాస్యులే కాదు బాగా చదువుకున్న ఐటీ ఉద్యోగులు కూడా నకిలీ వస్తువుల విషయంలో బోల్తా పడుతున్నారు. ఏది నకిలీనో, ఏది నిజమైనదో తేల్చుకోలేక వినియోగదారులు ఘోరంగా మోసపోతున్నారు. రోజువారీ వినియోగంలో ఉండే వస్తువుల వ్యాపారం రూ.కోట్లలో ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నకిలీ, కల్తీ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తాజాగా విజిలెన్స్ తనిఖీల్లో నకిలీ వస్తువులు బయటపడటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. తరచూ తనిఖీలు లేకపోవడం వల్ల ఇలా నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నట్టు ఆరోపణలున్నాయి.

టీపొడిలో కొత్త కోణాలు

ఇటీవలి కాలంలో కల్తీ టీపొడి వినియోగం తీవ్రమైంది. పదే పదే వాడిన టీని ఎండపెట్టి చింతపిక్కల పొడి వంటివి కలిపి మళ్లీ అమ్ముతున్నారు. ఇందులో కొన్ని ఆకర్షించే రంగులు, రుచి కోసం రసాయనాలు కలుపుతున్నారు. ఒరిజనల్ టీపొడి అయితే ఒక గ్లాసు మంచినీళ్లలో వేస్తే... టీపొడి బాగా నానిన తర్వాత గానీ రంగుమారదు. అదే నకిలీ టీపొడి అయితే నీళ్లలో వేసిన రెప్పపాటులోనే నీళ్లన్నీ టీరంగులోకి మారిపోతాయి. లేబుళ్లు లేకుండా సంచుల కొద్దీ వస్తున్న ఈ టీపొడిలో మసాలాలు కలిపి వినియోగదారులకు అందిస్తున్న తీరు భయాందోళనకు గురి చేస్తోంది.

పాలను విషపూరితం చేస్తున్నారు

కల్తీపాలు ఇప్పటికీ యథేచ్ఛగా మార్కెట్లోకి వస్తున్నాయి. కొన్ని రకాల నూనెలను బాగా మరగకాచి, వాటిలో కొన్ని క్రీములు కలిపి నకిలీ పాలను తయారు చేస్తారు. వీటిని డెయిరీ సంస్థలకు అమ్ముతున్నారు. డెయిరీ సంస్థలు ఫ్యాట్ కంటెంట్ (కొవ్వు శాతం) చూస్తాయి గానీ, ఇవి నకిలీవా, కాదా అనే పరిస్థితి లేదు.

కల్తీ మాఫియా గుప్పిట్లోనే..

- కుళ్లిపోయిన వెన్నను కాచి నెయ్యిని తయారు చేస్తున్నారు. మంచి సువాసన కోసం కొన్నిరకాల రసాయనాలు కలుపుతున్నారు.
- కారంపొడిలో రకరకాల రసాయనాలతో పాటు కొన్ని రకాల పొట్టు కలిపి కారంపొడి తయారు చేస్తున్నారు.
- చిన్న పిల్లలకు ఇచ్చే గ్లూకోన్‌డీని కూడా కల్తీమయం చేశారు. కొన్ని రసాయనాల మిశ్రమం, శాక్రిన్‌లు కలిపి ఇస్తున్నారు. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యం గుల్లవుతోంది.
- పప్పు దినుసుల్లోనూ కల్తీ జరుగుతోంది. శనగపిండిలో బియ్యపు పిండి కలిపి అమ్ముతున్నారు.
- చిరు ధాన్యాల్లో అంటే ధనియాలు, మినపప్పు వంటివి బాగా ఆకర్షించేలా ఉండటం కోసం ఓరకమైన నూనెలను కలుపుతున్నారు. ఇవి చాలా ఆకర్షించేలా ఉంటాయి.
- తాజాగా సర్ఫ్ పౌడర్, సబ్బులు, గుడ్‌నైట్ లిక్విడ్ వంటి నకిలీ సరుకులు విజిలెన్స్ తనిఖీల్లో పట్టుకున్నారు.

నకిలీని కనిపెట్టేదెలా..?

- సబ్బులు, బట్టలకు వాడే సర్ఫ్ వంటివి కనిపెట్టడం సామాన్య వినియోగదారులకు కొంచెం కష్టమే. కానీ కొద్దిగా పరిశీలిస్తే...
- ఒరిజనల్ కంపెనీ వస్తువుకు, నకిలీ వస్తువుకు లేబుల్ మీద ఉన్న రాత (ఫాంట్)లో తేడా ఉంటుంది.
- లోగోలో కూడా ఒక అక్షరం తేడాతో ఇమిటేట్ చేస్తుంటారు.
- అన్నింటికీ మించి బార్‌కోడ్ అతి ముఖ్యమైనది. చిన్న చిన్న కిరాణా షాపుల్లో బార్‌కోడ్ స్కాన్ చేయరు.
- ఒకసారి బార్‌కోడ్ స్కాన్‌తో కొనుకున్న వస్తువును, కిరాణా షాపులో ఉన్న వస్తువును పోల్చి చూస్తే తేడా కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

డిక్లరేషన్ నిబంధనలే చూస్తాం

మా పరిధిలో కంపెనీ డిక్లరేషన్‌లో ఇచ్చిన నిబంధనలు మాత్రమే చూస్తాం. అవి కరెక్టుగా ఉన్నాయా లేదా అనేదే పరిశీలిస్తాం. వస్తువు నాణ్యత చూడటం మా పరిధిలో లేదు. డిక్లరేషన్ నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం.

– సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్, తూనికలు కొలతల శాఖ

యాజమాన్యాలే జాగ్రత్తగా ఉండాలి

నకిలీ ఏదో ఒరిజనల్ ఏదో సామాన్యులు కనిపెట్టలేరు. ఎన్నో ఏళ్లనుంచి వ్యాపారం చేస్తున్న కిరాణా షాపుల యజమానులకు డూప్లికేట్ ఏదో, మంచిదేదో తెలుసు. ఏజెన్సీలనుంచి తీసుకునేటప్పుడు జాగ్రత్త వహించి తీసుకోవాలి. లేదంటే నకిలీ ప్రొడక్టులు దొరికితే నష్టపోయేది కిరాణాషాపుల యాజమాన్యాలే.

– జమాల్ బాషా, సీఐ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



మునిశేఖర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం: అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురంలో జరిగింది. టౌ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు.. కడపకు చెందిన మునయ్య కుమారుడు సుంకర మునిశేఖర్ (50) ఆదివారం అరవింద నగర్‌లో పరిటాల రవి ఇంటి సమీపంలోని సాయి కొరల్ కౌంటీ అపార్ట్‌మెంట్‌లో ఉన్న తన స్నేహితుడు జయప్రకాష్ నాయుడును కలవడానికి వచ్చాడు. అయితే, తాను ఊరికి వెళ్తున్నానని చెప్పి జయప్రకాష్ నాయుడు వెళ్లిపోగా.. మునిశేఖర్ అక్కడే ఉన్నాడు. రాత్రి 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ 5వ ఫ్లోర్ నుంచి కిందికి దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలిలోనే ప్రాణాలు వదిలాడు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని సీఐ శ్రీకాంత్‌యాదవ్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, మునిశేఖర్ గతంలో సోషల్ వెల్ఫేర్ విభాగంలో ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసినట్లు తెలిసింది. స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా స్కూల్ సమీపంలో ఓ గదిలో అద్దెకున్నట్లు సమాచారం. భార్య లక్ష్మితో 2015 నుంచి మునిశేఖర్ విడిగా ఉంటున్నాడు. భార్య, పిల్లలు అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

సీటు.. 'తమ్ముళ్ల'తో తలపోటు!



ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బి.ఉజ్జినప్ప. బుక్కరాయసముద్రం మండలం దండువారిపల్లి గ్రామం. ఈయన భార్య మృతి చెందింది. కూతురు బి.హారిక 7వ తరగతి పూర్తయింది. ఈసారి 8వ తరగతికి వెళ్తోంది. బుక్కరాయసముద్రం కేజీబీవీలో 3, కురుగుంట కేజీబీవీలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ముందుగా తల్లిదండ్రులు లేని పిల్లలకు, ఆ తర్వాత తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ క్రమంలో ఆ రెండు కేజీబీవీల్లోనూ ఖాళీ సీట్లయితే భర్తీ చేశారు కానీ తల్లిలేని హారికకు కాకుండా తల్లిదండ్రులిద్దరూ ఉన్న పిల్లలకు అవకాశం కల్పించారు. ఈ వ్యవహారం వెనుక కొందరు మంత్రాంగం నడిపారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. హారిక తండ్రి రోజూ సమగ్రశిక్ష కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాడు.



కురుగుంట కేజీబీవీ

మా వారికి సీటు ఇవ్వాల్సిందే..

ఖాళీ సీట్ల భర్తీకి జాబితా చాంతాడంత తయారైంది. దీంతో ఎవరికివారు పైరవీలు చేస్తూ జిల్లా అధికారులతో పాటు స్పెషల్ ఆఫీసర్లపై ఒత్తిళ్లు చేస్తున్నారు. కొందరు చోటా నాయకులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖలు తీసుకొచ్చి అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఓ మంత్రి తన నియోజకవర్గంలోని కేజీబీవీ ఎస్‌ఓపై చోటా నాయకులు తీవ్ర ఒత్తిడి చేసి 'మేము చెప్పినట్టు చేయకపోతే నిన్ను తీసేయిస్తాం' అంటూ హెచ్చరించడంతో ఆమె అంతేస్థాయిలో తిరగబడ్డారు. అయితే ఏమి జరిగిందే ఏమో తెలీదుకాని ఇటీవల ఖాళీ సీట్ల భర్తీకి వచ్చేసరికి వారు ఏది చెబితే అందుకు ఆమె అంగీకరిస్తూ జిల్లా అధికారులకు సిఫార్సు చేయడం విశేషం.

- కేజీబీవీ ప్రవేశాలకు ఎస్‌ఓలు, అధికారులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు
- అర్హులైన ఆడబిడ్డలకు అన్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం రాజకీయ పైరవీలు, అధికార పార్టీకి చెందిన చోటా నాయకుల ఒత్తిళ్లు వెరసి అర్హులైన ఆడ పిల్లలకు అవకాశం దక్కకుండా పోతోంది. జిల్లాలో మొత్తం 32 కేజీబీవీలున్నాయి. ప్రతి కేజీబీవీలోనూ ఈ విద్యా సంవత్సరం (2025–26)లో 6వ తరగతిలో చేరేందుకు 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు 40 సీట్ల చొప్పున భర్తీకి చర్యలు తీసుకున్నారు. అంతా ఆన్‌లైన్ విధానంలో రాష్ట్ర స్థాయి అధికారులే ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అయితే మిగులుగా ఉన్న సీట్ల భర్తీ జిల్లా అధికారులకే ఇవ్వడం తలనొప్పిగా మారింది.

నిబంధనల మేరకే భర్తీ



కేజీబీవీల్లో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ విషయంలో నిబంధనల మేరకే ముందుకెళ్తున్నాం. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితోనే భర్తీ చేస్తున్నాం. తల్లిదండ్రులు లేని, తల్లి లేక తండ్రి ఉన్న బాలికలకే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆ తర్వాత డ్రాపౌట్స్, పేద పిల్లలను పరిగణనలోకి తీసుకుంటున్నాం.

– టి.శైలజ, సమగ్రశిక్ష ఏపీసీ

ఇక చూస్తూ ఊరుకునేది లేదు

- పెద్దారెడ్డిని పోలీసులే తాడిపత్రికి తీసుకెళ్లాలి
- లేకుంటే ఎస్పీ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేస్తాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- పోలీసుల తీరుపై ధ్వజమెత్తిన పార్టీ నేతలు



మాట్లాడుతున్న అనంత, చిత్రంలో పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టు పట్టించింది. అందులో పోలీసు వ్యవస్థ ఒకటి. జిల్లాలో మద్యం మాఫియా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నా, అరాచకాలు, అకృత్యాలు, దౌర్జన్యాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోరు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు రక్షణ కల్పిస్తూ తాడిపత్రికి పంపాలి. లేని పక్షంలో ఎస్పీ కార్యాలయ ఆవరణలోనే భారీ ధర్నా చేస్తాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. పోలీసులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని బలవంతంగా తాడిపత్రి నుంచి అనంతపురం తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న అనంత, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు నగరంలోని పెద్దారెడ్డి క్యాంపు ఆఫీస్‌కు చేరుకుని ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో 'అనంత' మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, పోలీసుల తీరుపై ధ్వజమెత్తారు. పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపాలని ఈ ఏడాది ఏప్రిల్ 30న డీజీపీ, ఎస్పీలను హైకోర్టు ఆదేశించిందన్నారు. ఈ విషయమై తాము ఎస్పీ జగదీష్‌కు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆదేశించిందని, ఆ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తాడిపత్రిలోని తన సొంత ఇంటికి పెద్దారెడ్డి వెళ్లారన్నారు. అయితే, పెద్దారెడ్డి అక్కడ ఉండకూడదంటూ పోలీసులు బలవంతంగా అనంతపురం తరలించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారో లేదో ఓ సారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.హైకోర్టు ఆదేశాలు, చట్ట ప్రకారం ముందుకెళ్తున్నారా.. లేక కూటమి ప్రభుత్వం, డీజీపీ ఆదేశాలతో ముందుకెళ్తున్నారా అని ప్రశ్నించారు.

ప్రభాకర్ రెడ్డికి ఎందుకంత భయం..

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జిల్లా పోలీసులు వ్యవహరిస్తుండడం అన్యాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే అయిన తనను తాడిపత్రిలోకి వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. తనను చూస్తే జేసీ ప్రభాకర్ రెడ్డికి ఎందుకంత భయమో అర్థం కావడం లేదన్నారు. 'నన్ను చూస్తే ప్రభాకర్ రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తుందా..' అని ఎద్దేవా చేశారు. రాజకీయంగా వైఎస్సార్ సీపీ బలపడుతుందనే ఆలోచనతో వారున్నారని విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, హైకోర్టును మరోసారి ఆశ్రయించి, వారి ఉత్తర్వుల మేరకే తాడిపత్రిలో అడుగుపెడతానని స్పష్టం చేశారు. ఏదో ఒక రోజు తామూ అదే రీతిలో బుద్ధి చెబుతామన్నారు. 'నేను రాజకీయాలు చేయకపోతే, అక్కడ ఉండలేకపోతే నువ్వు తాడిపత్రిని సరిహద్దుగా చేసుకుని ఉండాల్సి ఉంటుంది' అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డికి చురకలు అంటించారు. అనంతపురంలో ప్రభాకర్ రెడ్డిని అడ్డుకుంటామని, ఏది చేతనైతే అది చేసుకోవాలని పేర్కొన్నారు.

అమానవీయం



హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎస్పీ జగదీష్ నెలల తరబడి జాప్యం చేయడం, సొంత ఇంటికి మాజీ ఎమ్మెల్యే వెళితే అక్కడి నుంచి లాక్కుని రావడం అమానవీయం. జిల్లాలో అకృత్యాలు పెరిగిపోతున్నా పట్టించుకునే స్థితిలో పోలీసులు లేరు. పెద్దారెడ్డిని కోర్టు ఉత్తర్వుల మేరకు తాడిపత్రికి తీసుకెళ్లాలి.

– డాక్టర్ సాకే శైలజానాథ్, మాజీ మంత్రి

రెడ్ బుక్‌కు సమాధి కట్టాలి



మంత్రి లోకేష్ సృష్టించిన రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా పాలన సాగకూడదు. కోర్టు ఆదేశాల మేరకు అన్ని వ్యవస్థలూ పని చేయాలి. పెద్దారెడ్డిని తన సొంత నియోజకవర్గానికి వెళ్లనివ్వకుండా కూటమి ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడుతోంది. పోలీసు వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందింది. రెడ్ బుక్ రాజ్యాంగానికి సమాధి కట్టాల్సిందే.

– తలారి రంగయ్య, మాజీ ఎంపీ

గందరగోళంగా సర్వేయర్ల బదిలీల కౌన్సెలింగ్

- సీనియార్టీ జాబితాపై తీవ్ర అభ్యంతరం
- ఆరు గంటలు ఆలస్యంగా కౌన్సెలింగ్ ప్రారంభం





పోలీసు బందోబస్తు నడుమ సాగుతున్న గ్రామ సర్వేయర్ల కౌన్సెలింగ్, ఆందోళనకు దిగిన సర్వేయర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని సర్వే, భూరికార్డుల శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గ్రామ సర్వేయర్ల బదిలీల కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. సీనియార్టీ జాబితాపై గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర నాయకులు అడ్డు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా జాయినింగ్ డేట్ ఆధారంగా జాబితా ఎలా ఇస్తారంటూ సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్‌తో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహేష్‌నాయుడు వాగ్వాదానికి దిగారు. ఇతర శాఖలు, జిల్లాల్లో మాదిరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ర్యాంక్ ఆధారంగా జాబితా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాదంటే కౌన్సెలింగ్‌ను బాయ్ కాట్ చేస్తామని హెచ్చరించారు. దీంతో ప్రక్రియ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. పరిస్థితిని డీఆర్‌ఓ మలోల దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. వెంటనే ఆయన సర్వే శాఖ కార్యాలయానికి చేరుకుని సీనియారిటీ జాబితాపై ఏడీలు రూప్లానాయక్, విజయశాంతిబాయి, సూపరింటెండెంట్ అయూబ్‌తో సమీక్షించారు. ఆయన సూచన మేరకు ర్యాంక్ ఆధారంగా సీనియారిటీ జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ తతంగం కారణంగా ఉదయం 9 గంటలకు మొదలవ్వాల్సిన బదిలీ కౌన్సెలింగ్ ఆరు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైంది.

అన్యాయం.. ఆగ్రహం

ఉమ్మడి జిల్లాలో 828 మంది గ్రామ సర్వేయర్లు ఉన్నారు. వీరిలో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 624 మంది ఉన్నారు.తొలుత మెడికల్ గ్రౌండ్స్, తరువాత స్పౌజ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం మిగిలిన వారికి చేపట్టారు. అయితే, కౌన్సెలింగ్‌లో అన్యాయం చేస్తున్నారంటూ సర్వేయర్లు ఆందోళనకు దిగడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లా సర్వే శాఖ ఏడీ విజయశాంతి బాయి అక్కడికి వచ్చి 'సర్వే చేయడం చేతకాదు..ఇలాంటివి బాగా చేస్తారు' అంటూ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడీ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. విషయం కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి వెళ్లడంతో సర్వేయర్లను పిలిపించి మాట్లాడడంతో సమస్య కొలిక్కి వచ్చింది. ఎవరికైనా అన్యాయం జరిగితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పడంతో సర్వేయర్లు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

సజావుగా వీఆర్‌ఓల బదిలీల కౌన్సెలింగ్



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన గ్రేడ్‌-2 వీఆర్‌ఓలు

అనంతపురం అర్బన్‌: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం చేపట్టిన చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాల గ్రేడ్‌-2 వీఆర్‌ఓల బదిలీల కౌన్సిలింగ్‌ సజావుగా జరిగింది. మొత్తం 328 మంది హాజరు కాగా, ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు 121 మంది ఉన్నారు. మరో 53 మంది రిక్వెస్ట్‌ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ బదిలీ కౌన్సెలింగ్‌ను డీఆర్‌ఓ ఎ.మలోల, అనంతపురం. శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టరేట్‌ పరిపాలనాధికారులు అలెగ్జాండర్‌, వెంకటనారాయణ నిర్వహించారు. ఎస్‌ఆర్‌లు, ఇతర పత్రాలను డిప్యూటీ తహసీల్దార్లు మూర్తి, లీలాకాంత్‌ పరిశీలించారు. ఇదిలా ఉండగా ఉదయం 11గంటలకు మొదలు కావాల్సిన బదిలీల కౌన్సెలింగ్‌ మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలు కావడంతో చంటిపిల్లలతో వచ్చిన మహిళా వీఆర్‌ఓలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు.

వెంటనే పీఆర్సీ ప్రకటించాలి : ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎస్‌.రామాంజనేయులు పేర్కొన్నారు. పీఆర్సీతో పాటు డీఏ కూడా ప్రకటించాలన్నారు. బదిలీ అయిన టీచర్లకు పొజిషన్‌ ఐడీలు కేటాయించి జీతాలకు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ పొందుతున్న టీచర్ల స్థానాల్లో సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్‌, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వి.రాజశేఖర్‌, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌ జి.కిషోర్‌, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, రామకృష్ణ, నరసింహ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సిఫారసుకే పెద్దపీట

- సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్‌లో అధికారుల తీరు
- ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు ప్రాధాన్యం
- ప్రజాప్రతినిధుల నుంచి నేరుగా అధికారులకు ఫోన్‌ చేయించినా సరే
- మంచి ర్యాంకు ఉన్నా సరే దూరంగానే పోస్టింగ్‌
- పలుకుబడి లేని ఉద్యోగుల పరిస్థితి దయనీయం
- అధికారుల తీరుపై సచివాలయ ఉద్యోగుల అసహనం



కౌన్సెలింగ్‌కు హాజరైన సచివాలయ ఉద్యోగులు



సిఫారసు చేస్తూ ప్రజాప్రతినిధి చేసిన ఫోన్‌ కాల్‌ను అభ్యర్థి ఎదుటే మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

అనంతపురం సిటీ: 'మనకు కావాల్సిన పిల్లలు వస్తున్నారు. జర చూసుకోండి. లెటర్‌ కూడా ఇచ్చి పంపుతున్నాం. వారు కోరుకున్న చోటుకు పోస్టింగ్‌ ఇవ్వండి. లేదంటే రోడ్డు పాయింట్‌కు వేయండి. ఏ ఒక్కటీ మిస్‌ కావడానికి వీల్లేదు. అడిగినవన్నీ చేయాల్సిందే' అంటూ సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌ సందర్భంగా వివిధ శాఖల అధికారులకు కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా ఫోన్ల మీద ఫోన్లు చేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌ ప్రక్రియ రెండో రోజు ఆదివారం అనంతపురంలోని పలు ప్రాంతాల్లో కొనసాగింది. ఓ వైపు కౌన్సెలింగ్‌ ప్రక్రియలో బిజీబిజీగా ఉన్నా.. మరోవైపు ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఫోన్‌ కాల్‌ను అధికారులు లిఫ్ట్‌ చేసి మాట్లాడుతూ హల్‌చల్‌ చేశారు. ఎమ్మెల్యేల లెటర్లు ఉన్న వారు ముందుగా రావాలని, లెటర్లు లేని వారిని పక్కన ఉండాల్సిందిగా సూచించారు. లెటర్లు స్వీకరించి వారు ఎక్కడికి పోస్టింగ్‌ కోరుకుంటున్నారో మరీ తెలుసుకుని కేటాయించారు.

తొలి రోజు అనుభవంతో.. మలి రోజు ప్రశాంతం

సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. తొలి రోజు (శనివారం) నిర్వహించిన కౌన్సెలింగ్‌ ప్రక్రియ గందరగోళంగా మారి.. ఆందోళనలతో ముగిసింది. ఈ అనుభవంతో మలి రోజు (ఆదివారం) అధికారులు తీసుకున్న కొన్ని చర్యలు సాఫీగా సాగేలా దోహదపడ్డాయి. అభ్యర్థులందరినీ బయటే ఉంచి.. కొందరిని మాత్రమే అనుమతిస్తూ కౌన్సెలింగ్‌ ప్రక్రియ చేపట్టడంతో తొక్కిసలాటకు తావు లేకుండా పోయింది. అయితే అర్ధరాత్రి వరకూ కౌన్సెలింగ్‌ కొనసాగినా ఇంకా అభ్యర్థులు మిగిలే ఉన్నారు.

లెటర్లు ఉన్న వారికే ప్రాధాన్యత..

ఎమ్మెల్యేల లెటర్లు ఉన్న వారికే అధికారులు ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. ఎమ్మెల్యేల లెటర్లు తెచ్చారా.. అయితే రండి. మీకు కావాల్సిన స్థానం కోరుకోండి అంటూ అడిగి మరీ వారికి సహకరించారు. మరి కొందరి విషయంలో ఎమ్మెల్యేలు నేరుగా ఫోన్లు చేసి పేర్లు సిఫారసు చేయడం గమనార్హం. జెడ్పీ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో డిజిటల్‌ అసిస్టెంట్ల కౌన్సెలింగ్‌ కొనసాగుతుండగా డీపీఓ నాగరాజునాయుడుకు తరచూ ఫోన్‌ కాల్స్‌ వచ్చాయి. అయినా ఆయన ఓపిగ్గా మాట్లాడుతూ కనిపించారు. హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి ఓ ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌ ర్యాంక్‌లో తొలి స్థానంలో ఉన్నా.. అక్కడి ఎమ్మెల్యే బాలకృష్ణ నుంచి ఓ అమ్మాయి లెటర్‌ తెచ్చుకున్నారు. ఒకే స్థానం కోసం ఇద్దరూ పోటీపడ్డారు. అయితే అప్పటికే ఆ స్థానం తొలి ర్యాంకర్‌ అబ్బాయికి కేటాయించగా.. అమ్మాయికి సర్దిచెప్పి మరో చోట అవకాశం కల్పించారు. అయితే ఏమాత్రం పలుకుబడి లేని వారు, ఎమ్మెల్యేల లెటర్లు తెచ్చుకోలేకపోయిన వారు మదనపడ్డారు.

నిబంధనలకు వ్యతిరేకంగా పశుసంవర్ధక శాఖలో..

పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్కడి అధికారులు కౌన్సెలింగ్‌ ప్రక్రియ చేపట్టారని సచివాలయ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. కౌన్సెలింగ్‌కు ముందే అభ్యర్థులు మూడు స్థానాలను ఆప్షన్లగా చూపిస్తూ దరఖాస్తు చేసి ఉన్నారు. ఇందులో ఏదో ఒక స్థానాన్ని కౌన్సెలింగ్‌కు పిలిచినప్పుడు కేటాయించాల్సి ఉంటుంది. అయితే పశుసంవర్ధక శాఖలో మాత్రం మీరు ఏవైనా మూడు మండలాలు కోరుకొని ఆప్షన్లు ఇచ్చి వెళ్లండి. అందులో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఇస్తామంటూ' ఉద్యోగులను వెనక్కి పంపడంపై నాయకులు అసహనం వ్యక్తం చేశారు.

అర్ధరాత్రి వరకూ కొనసాగిన కౌన్సెలింగ్‌..

ఉమ్మడి జిల్లా యూనిట్‌గా సచివాలయ ఉద్యోగులకు అనంతపురంలోని పలు ప్రాంతాల్లో కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో మిగిలి ఉండడంతో అర్ధరాత్రైనా సరే పూర్తి చేయాలన్న పట్టుదలతో అధికారులు పని చేశారు. పోలీస్‌ బందోబస్తు మధ్య కౌన్సెలింగ్‌ ప్రక్రియ సజావుగా కొనసాగింది. చాలా చోట్ల కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉద్యోగులు అసౌకర్యానికి గురయ్యారు.

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం : యూటీఎఫ్‌



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్‌ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: ప్రజలను సమన్వయం చేసుకుని ప్రభుత్వ బడులను కాపాడుకుందామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (యూటీఎఫ్‌) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్‌ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైతిక విలువలు నేర్పుతున్న ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఆడిట్‌ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభ దినాల నుంచి విద్యలో వెనుకబడిన విద్యార్థులకు చదువుపై ఆసక్తిని కల్పించేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శులు అబ్దుల్‌ వహాబ్‌ ఖాన్‌, శేఖర్‌, రాముడు, సుబ్బరాయుడు, రాష్ట్ర కౌన్సిలర్‌ ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, ఆడిట్‌ కమిటీ కన్వీనర్‌ చంద్రమోహన్‌ పాల్గొన్నారు.

మద్యం మత్తునే హత్యకు కారణం!

- సిదానంద హత్య కేసులో వీడిన మిస్టరీ
- చిన్నపాటి గొడవ కారణంగా హత్య
- నిందితుల అరెస్ట్‌



విలేకరులతో మాట్లాడుతున్న అనంతపురం అర్బన్‌ డీఎస్పీ శ్రీనివాస రావు

అనంతపురం: చిన్నపాటి వాదన కారణంగా ఘర్షణ పడి ఓ యువకుడిని హతమార్చిన కేసులో ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు అనంతపురం అర్బన్‌ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు. అనంతపురం నాల్గో పట్టణ పీఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

ఈ నెల 24న ఉదయం అనంతపురంలోని బళ్లారి బైపాస్‌ సర్కిల్‌లో జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఓ యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పార్క్‌లో పడుకుని ఉన్న వ్యక్తి తలపై గుర్తు తెలియని వ్యక్తులు ఫుట్‌పాత్‌ బ్రిక్‌తో కొట్టి హత్య చేసినట్లుగా నిర్ధారించారు. హతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి గార్లదిన్నె మండలం, కోటంక గ్రామానికి చెందిన గూడూరు సిదానందగా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో బంధువులు వచ్చి నిర్ధారించారు. ఘటనపై నాల్గో పట్టణ సీఐ ఎస్‌.జగదీష్‌ కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

నేర పరిశోధనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని..

తొలుత సిదానందను ఆయన భార్య తరఫు వారు హత్య చేసి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం కాగా, ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టి అనుమానాల్లో వాస్తవం లేదని నిర్ధారించారు. నేర స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో నేర పరిశోధనను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మద్యం షాపులో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వారి కోసం గాలింపు చేపట్టారు. హత్య జరిగిన అనంతరం ఇద్దరూ రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలు మార్గంలో తిరుపతికి చేరుకున్నట్లుగా పసిగట్టారు. అనంతరం పక్కా ఆధారాలతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో సిదానందను హత్య చేసినట్లుగా అంగీకరించారు.

భార్యను దూషించాడనే...

అనంతపురంలోని ఐదో రోడ్డు భవానీ గుడి వద్ద నివాసముంటున్న ఎరికల నాగయ్య కుమారుడు ఎరికల లక్ష్మన్న అలియాస్‌ అలీ/ చిన్న లింగన్న/ అంజి, కళ్యాణదుర్గం రోడ్డులోని విద్యారణ్య నగర్‌లో నాగులకట్ట వద్ద నివాసముంటున్న తుమ్మశెట్టి వెంకటరెడ్డి ఇద్దరూ స్నేహితులు. వీరిద్దరూ బొప్పాయి, దోసకాయ లోడింగ్‌ పనులు చేస్తూ, తాగుడుకు అలవాటు పడ్డారు. ఈ నెల 23న రాత్రి బళ్లారి బైపాస్‌ సర్కిల్‌ సమీపంలో మద్యం షాపు వద్ద తాగుతూ అప్పటికే అక్కడున్న సిదానందతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఎరికల లక్ష్మన్నను సిదానంద బూతులు తిడుతూ అసభ్యకరంగా మాట్లాడాడు. లక్ష్మన్న భార్యనుద్దేశించి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో ఆవేశానికి లోనైన లక్ష్మన్న తన స్నేహితుడు వెంకటరెడ్డితో కలసి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమయ్యాడు. అన్న క్యాంటీన్‌ వద్ద ఉన్న పార్కులో సేద తీరుతున్న సిదానంద వద్దకు చేరుకుని నుదుటిపై ఫుట్‌బాత్‌ బ్రిక్‌తో దాడి చేశారు. సిదానంద అక్కడికక్కడే చనిపోవడంతో ఇద్దరూ రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలులో తిరుపతికి వెళ్లారు. నిందితులను అరెస్ట్‌ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఎస్‌.జగదీష్‌, ఎస్‌ఐలు కె.ప్రసాద్‌, పి.విజయభాస్కర్‌ నాయుడు, టెక్నికల్‌ టీంను ఎస్పీ పి.జగదీష్‌ అభినందించారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

- ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి డిమాండ్‌



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్‌: ఆర్టీసీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని ఏపీపీటీడీ ఈయూ (ఎంప్లాయీస్‌ యూనియన్‌) రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన టేబుల్‌పై ఉన్న ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకాలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 4, 5 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిక్‌ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నడిపించాలని, ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యూటీ, టర్మినల్‌ ఎన్‌క్యాష్‌మెంట్‌ చెల్లించాలని డిమాండ్‌ చేశారు. బకాయిలు వెంటనే చెల్లించాలన,ఇ డబల్‌ డ్యూటీలకు సంబంధించి ఉద్యోగులకు ఇస్తున్న రెమ్యూనరేషన్‌ను మరింత పెంచాలని కోరారు. టిమ్స్‌ డ్యామేజీలపై చేస్తున్న రికవరీలను నిలుపుదల చేయాలన్నారు. కాలం చెల్లిన బస్సుల బ్రేక్‌ డౌన్‌ విషయంలో గ్యారేజీ సిబ్బందిని బాధ్యులను చేస్తూ పనిష్మెంట్‌ ఇస్తున్నారని, ఈ విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు ఖాన్‌, రామకృష్ణ, కొండయ్య, మల్లికార్జున, విశ్వనాథరెడ్డి, గోపాల్‌, ఓబులరత్నం తదితరులు పాల్గొన్నారు.

బదిలీల తీరుపై ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల అసంతృప్తి

అనంతపురం సెంట్రల్‌: ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ఆదివారం ఉద్యాన, పశు సంవర్ధకశాఖ కార్యాలయాల్లో కొనసాగింది. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్‌ కింద దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్‌ చేపట్టారు. అయితే కొందరు తాము కోరుకున్న స్థానం కాకుండా మరో స్థానం కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యానశాఖ పరిధిలో చేపట్టిన బదిలీల ప్రక్రియకు 280 మంది విలేజ్‌ హార్టికల్చర్‌ అసిస్టెంట్లు హాజరు కాగా, వారి ఎస్‌ఆర్‌లు ఇతర ధ్రువీకరణ పత్రాలను ఉద్యానశాఖ ఉమ్మడి జిల్లాల డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్‌, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏడీహెచ్‌ దేవానందన్‌, సూపరింటెండెంట్‌ బాషా తదితరులు పరిశీలించి, పోస్టింగ్‌ కల్పించారు. అలాగే పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు వెంకటస్వామి, శుభదాస్‌, డీడీలు, సూపరింటెండెంట్‌ల సమక్షంలో జరిగిన కౌన్సెలింగ్‌కు 180 మంది విలేజ్‌ అనిమిల్‌ హస్బెండరీ అసిస్టెంట్‌లు హాజరయ్యారు.

ట్యాంకర్‌ దగ్ధం



కాలిపోతున్న ట్యాంకర్‌

గుత్తి రూరల్‌: మండలంలోని బసినేపల్లి శివారున కర్నూలు జిల్లా జి.ఎర్రగుడి గ్రామం వద్ద ఆదివారం టైరు పేలి మంటలు చెలరేగడంతో ఓ ట్యాంకర్‌ దగ్ధమైంది. గుత్తి నుంచి ఆదోని వైపు బెల్లం పాకంతో వెళ్తున్న ట్యాంకర్‌ గుత్తి-పెండేకల్లు రైలు మార్గంలోని రైల్వే బ్రిడ్జి కిందకు చేరుకోగానే టైరు పేలింది. దీంతో మంటలు చెలరేగి ట్యాంకర్‌కు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్‌, క్లీనర్‌ బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పే లోపు ట్యాంకర్‌ పూర్తిగా దగ్ధమైంది. సంఘటన స్థలాన్ని రైల్వే అధికారులతో పాటు జొన్నగిరి పోలీసులు పరిశీలించారు.

'అధికార' అండ.. మట్టి దందా

- దొడగట్ట చెరువులో భారీగా మట్టి దోపిడీ
- కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మెట్టు గోవిందరెడ్డి, రైతులు

డి.హీరేహాళ్‌(రాయదుర్గం): డి.హీరేహాళ్‌ మండలం దొడగట్ట చెరువులో కొద్ది రోజులుగా భారీఎత్తున మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. టీడీపీ నాయకుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. తొలుత ట్రాక్టర్ల ద్వారా మట్టి రవాణా మొదలుపెట్టారు. ఇప్పుడు ఏకంగా జేసీబీలతో టిప్పర్లలోకి లోడ్‌చేసి పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని సండూరు, రాంపురం, బళ్లారి తదితర ప్రాంతాల్లో ఇటుకల బట్టీలకు ఒక్కో ట్రిప్పు మట్టి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ దందా వెనుక గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి హస్తం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా.. మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టిన దొడగట్ట చెరువును ఆదివారం రైతులతో కలసి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సందర్శించారు. అక్కడి నుంచి కర్ణాటక సరిహద్దులో మార్తల్‌ వద్ద నిల్వచేసిన సుమారు వంద ట్రిప్పుల మట్టిని పరిశీలించారు. అక్కడి నుంచే కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, రాయదుర్గం రూరల్‌ సీఐ వెంకటరమణ, మైనర్‌ ఇరిగేషన్‌ డీఈకి ఫోన్‌ చేసి.. మట్టి అక్రమ రవాణాను సత్వరం అడ్డుకోవాలని కోరారు. అలాగే మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ విప్‌ కాలవ శ్రీనివాసులు అండ చూసుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారన్నారు. ఇసుక, మట్టితో పాటు ప్రకృతి సంపద కొల్లగొట్టడమేనా సమర్థ నాయకత్వం అంటే అని ప్రశ్నించారు. మెట్టు వెంట స్థానిక సర్పంచ్‌, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు ఎర్రగుంట కేశవరెడ్డి, మురడి మురళీమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- ఎస్‌యూసీఐ (సీ) కేంద్ర కమిటీ సభ్యుడు అమర్‌నాథ్‌

అనంతపురం టవర్‌క్లాక్‌: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ కూటమి ప్రభుత్వాన్ని ఎస్‌యూసీఐ(సీ) కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం జరిగిన ఎస్‌యూసీఐ (సీ) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌ సిక్స్‌ పేరుతో ప్రజలను సీఎం చంద్రబాబు మభ్య పెట్టారని మండిపడ్డారు. అశాస్త్రీయ విధానాలతో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను కారు చౌకగా పెట్టుబడి దారులకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. మద్యం విక్రయాలను ఆదాయ వనరుగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం పేరుతో గ్రాఫిక్‌ డిజైన్లను ప్రదర్శిస్తున్నారన్నారు. వైజాగ్‌ స్టీల్‌ ప్లాంట్‌ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. శ్రమ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరణ?

- శ్రీసత్యసాయి జిల్లా కృష్ణాపురంలో ఘటన
- మృతురాలు పామిడి నివాసి కుమార్తె
- కుటుంబ సభ్యులు నిలదీస్తుండగానే భర్త పరారీ



శ్రావణి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పామిడి/పుట్టపర్తి: అదనపు కట్నం కోసం తమ కుమార్తెను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడంటూ బాధిత కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు తెలిపిన మేరకు... పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో నివాసముంటున్న కమ్మరి రామాచారి, పుష్పవతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కార్పెంటర్‌ వృత్తితో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో 9 నెలల క్రితం రామాచారి తన పెద్ద కుమార్తె శ్రావణి(25)ని శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన గోవిందాచారి, లక్ష్మీదేవి దంపతుల రెండో కుమారుడు నీలకంఠాచారికి ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లి సమయంలో కట్న కానుకల కింద రూ.లక్షలు విలువ చేసే బంగారు, నగదు ఇచ్చారు. పెళ్లి అనంతరం నీలకంఠ కృష్ణాపురంలోనే వేరు కాపురం పెట్టాడు. వ్యవసాయంతో పాటు వేరుశనగ పప్పు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల వ్యాపారానికి సంబంధించి యంత్రాల కొనుగోలుకు డబ్బు అవసరం కావడంతో శ్రావణి తల్లిదండ్రులు నీలకంఠకు రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ క్రమంలో అదనపు కట్నం కోసం శ్రావణిని నీలకంఠ వేధించడం మొదలుబెట్టాడు. తరచూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. దీనికి తోడు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. వ్యసనాలు మానుకోవాలని భార్య పదేపదే చెప్పినా వినేవాడు కాదు. ఈ క్రమంలో తనను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్న భార్యను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న నీలకంఠాచారి పథకం ప్రకారం శనివారం రాత్రి నిద్రపోతున్న భార్య గొంతునులిమి హతమార్చి, అనంతరం ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అనంతరం పామిడిలోని అత్తామామకు ఫోన్‌చేసి విషయం తెలిపాడు. అక్కడకు చేరుకున్న రామాచారి దంపతులు... తమ కుమార్తెది ఆత్మహత్య కాదని, హత్యగా నిర్ధారించుకుని నిలదీసేలోపు నీలకంఠాచారి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్‌ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం అందే నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపడతామని డీఎస్పీ విజయ్‌కుమార్‌ పేర్కొన్నారు.

విద్యుత్‌ చార్జీలను వెంటనే తగ్గించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్‌



మాట్లాడుతున్న రామకృష్ణ

కళ్యాణదుర్గం రూరల్‌: రాష్ట్రంలో పెంచిన విద్యుత్‌ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్‌ చేశారు. కళ్యాణదుర్గంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్‌ ఛార్జీలు పెంచబోమని స్పష్టమైన హామీనిచ్చిన చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని తుంగలో తొక్కి విద్యుత్‌ చార్జీలను ఇష్టానుసారంగా పెంచుతున్నారని మండిపడ్డారు. స్మార్ట్‌ మీటర్ల ఏర్పాటు సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు.కళ్యాణదుర్గం కేంద్రంగా వెలుగు చూసిన ఈ-స్టాంప్‌ కుంభకోణం రాష్ట్ర మంతటా వ్యాపించి ఉంటుందని, ఆ దిశగా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 5న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యదర్శి వర్గ సభ్యుడు సంజీవప్ప, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్‌, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై రాళ్ల దాడి

నార్పల: మండలంలోని వెంకటాంపల్లిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహబూబ్‌పీరా ఇంటిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఏడుగురు ఆదివారం రాళ్లతో విరుచుకుపడ్డారు. బాధితుడు తెలిపిన మేరకు... తన ఇంటి పక్కనే ఉన్న కొద్దిపాటి స్థలాన్ని గతంలో మసీదుకు మహబూబ్‌పీరా విరాళం కింద ఇచ్చాడు. ఆ స్థలంలో గ్రామంలోని ముస్లిములంతా కలసి మసీదుతో పాటు ప్రహరీ నిర్మించారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు జోక్యం చేసుకుని మసీదుకు ప్రహరీ నిర్మాణాన్ని ఆక్షేపిస్తూ మహబూబ్‌పీరాను నిలదీశారు. సర్దిచెప్పే ప్రయత్నం చేసిన మహబూబ్‌పీరాపై దాడికి ప్రయత్నించడంతో ఆయన ఇంట్లోకి వెళ్లిపోయి తలుపులు వేసుకున్నాడు. దీంతో ఇంటిపై టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఘటనలో మహబూబ్‌పీరా కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలు నడిమిదొడ్డి రహీం, అప్పడు, హుసేన్‌పీరా, కాదర్‌వలి, హాజీ వలి, వలి, హాజీవలిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు షబ్బీర్‌

డి.హీరేహాళ్‌(రాయదుర్గం): వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. డి.హీరేహాళ్‌ గ్రామానికి చెందిన షబ్బీర్‌ (45) కుమార్తె బళ్లారిలో చదువుకుంటోంది. ఈ క్రమంలో ఆదివారం బళ్లారికి వెళ్లి కుమార్తెను పలకరించి, ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన షబ్బీర్‌.. గ్రామ సమీపంలోకి చేరుకోగానే హెల్మెట్‌ జారి కిందపడడంతో బ్రేక్‌ వేశాడు. అదే సమయంలో వెనుకనే వేగంగా దూసుకొచ్చిన టెంపో ట్రావెలర్‌ వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ గురుప్రసాద్‌ రెడ్డి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

రాధేయ కవిత్వం నిబద్ధతకు కొలమానం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు రాధేయ, ప్రగతి తదితరులు

అనంతపురం కల్చరల్: రాధేయ కవిత్వం నిబద్ధతకు కొలమానమని వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ కళాశాల వేదికగా రాజారాం అధ్యక్షతన ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రాధేయ రచించిన 'మానవీయం' కావ్యాన్ని ఆవిష్కరించారు. అడిషనల్ ఎస్పీ, కవి లోసారి సుధాకర్ పుస్తకాన్ని ఆవిష్కరించి రాధేయ కవిత్వ విశిష్టతపై మాట్లాడారు. మానవత్వమున్న మనుషులు కరువైపోతున్న రోజుల్లో ఇటువంటి కావ్యం పాత కొత్త పోకడల మేలుకలయికగా అభివర్ణించారు. స్పందన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర శాస్త్రి, డాక్టర్ అంకె శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసం, వ్యక్తిగత దుఃఖం, కవిత్వం డిక్షన్ కలగలిపిన త్రివేణి సంగమంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతినారాయణ, తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర హేమమాలిని, డాక్టర్ ప్రగతి, ప్రిన్సిపాల్ పురుషోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయి సేవకుల భిక్షాటన



భిక్షాటనకు బయల్దేరిన సాయి సేవకులు

అనంతపురం కల్చరల్: గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా సాయి సేవకులు భిక్షాటన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం మూడవ రోడ్డు షిరిడి సాయిబాబా మందిరం నుంచి మొదటి, రెండు, నాల్గవ రోడ్డులో ఇంటింటికి వెళ్లి బియ్యం, ఇతర నిత్యావసరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. షిరిడి సాయిబాబా జీవించిన రోజుల్లో ఆషాఢ పౌర్ణమి వేడుకల్లో అందరిని భాగస్వామ్యం చేస్తూ పుణ్యాన్ని అందరికి వచ్చేలా చూసేవారని సత్‌చరిత్ర చెబుతోందన్నారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ బాబా మందిరంలో నెల రోజుల ముందు నుంచి హోదాలు మరచి భక్తులందరూ భిక్షాటన చేస్తూ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జూలై 10న గురు పౌర్ణమి వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రి వరకు సాగే అన్నదానంలో అందరూ పాల్గొనాలని కోరారు.

'అడ్డగోలు బదిలీలు సరికాదు'



అధికారులపై మండిపడుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

అనంతపురం అగ్రికల్చర్: దర్జాగా అడ్డగోలుగా బదిలీలు చేస్తున్నా పట్టించునే వారు లేరని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. ఆదివారం ఉద్యాన శాఖలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు అక్రమంగా జరుగుతున్నాయని డీహెచ్ఓ ఉమాదేవి, ఏడీ దేవానందంతో వాగ్వాదానికి దిగారు. సచివాలయ ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించుకోవడమే కాకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సీనియార్టీ ర్యాంకులంటూ ఉద్యోగులను గందరగోళానికి గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. డబ్బు ఇచ్చిన వారిని అనుకూల ప్రాంతాలకు బదిలీ చేయడం భావ్యం కాదన్నారు. హెచ్ఓ రత్నకుమార్ రూ.లక్షలు వసూలు చేసి అక్రమ బదిలీలు చేస్తున్నారని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారని తెలిపారు. హెచ్ఓ రత్నకుమార్‌ను వెంటనే బయటకు పంపాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు తావులేకుండా బదిలీలు చేపట్టాలన్నారు. అక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఊరేగింపు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెంకటంపల్లిలో చౌడేశ్వరీ దేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల విరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరీ దేవిని పల్లకీలో కొలువుదీర్చి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. వెలుగుతున్న జ్యోతులను తలపై ఉంచుకుని నాట్యం చేశారు. భక్తులు ఫల, పుష్పాలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.



అలంకరణలో చౌడేశ్వరీ దేవి

ఈ జ్యోతుల ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పంపనూరుకు పోటెత్తిన భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తొలుత అర్చకులు స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకుపూజ అనంతరం పంచామృతాభిషేకాలు చేపట్టారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేశారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. స్వామి దర్శనానికి గంటల సమయం పట్టింది.



ఆలయంలో నేడు హుండీ కానుకల లెక్కింపు

ఆలయంలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఉదయాన్నే సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనవచ్చన్నారు.

ఎంఎస్ఎస్ సేవా సంస్థ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఎంఎస్ఎస్ సేవా సంస్థ సభ్యులు

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఎంఎస్ఎస్ సేవా సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాదిక్‌వలి, ఉపాధ్యక్షురాలిగా అనూష, కార్యదర్శిగా షెక్షావలి, సహాయ కార్యదర్శిగా సునీల్ కుమార్, కోశాధికారిగా ఇక్రంబాషా, కార్యవర్గ సభ్యులుగా ఖాజా, జయమ్మ, నాగమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సాధిక్‌వలి మాట్లాడుతూ.. ఎంఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రుద్రంపేట పంచాయతీ పరిధిలోని ప్రతి పేద కుటుంబంలో ఒక సభ్యుడికి ప్రమాద బీమా, రూపే కార్డు బీమా కింద రూ.4 లక్షల ప్రమాద బీమా అందిస్తామన్నారు. సహజ మరణం చెందితే రూ.30 వేలు అందించడంతో పాటు పేదల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. పేద ప్రజలను అండగా నిలవడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ సంస్థ లక్ష్యమన్నారు.

'ఉపాధి' అక్రమాలను నిగ్గు తేల్చాలి

రాప్తాడురూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు మూలి లోకనాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు రాచానపల్లి సర్పంచ్ బండా అంజియాదవ్ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్టం మేరకు ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. సర్పంచులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయాలన్నారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఈ బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 74 సవరణల మేరకు సర్పంచులకు ఉన్న అధికారాలను అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ హామీ మేరకు, గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లెల్లి నరసింహారెడ్డి, ఎస్టీ విభాగం అధ్యక్షుడు కృష్ణానాయక్, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు మాధవ రెడ్డి, జెడ్పీటీసీ చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మండల పంచాయతీ రాజ్ అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, కొడిమి సర్పంచ్ సుబ్బిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, రోసి రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూలి లోకనాథరెడ్డి

ఐక్యతతోనే బ్రాహ్మణుల అభివృద్ధి

అనంతపురం కల్చరల్: స్మార్త, మధ్వ, వైష్ణవ శాఖ బేధాలు లేకుండా ఐక్యతగా ఉంటే అభివృద్ధి సాధ్యమని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రాయలసీమ ఐక్య వేదిక సమావేశం జరిగింది. జిల్లా వ్యాప్తంగా బ్రాహ్మణులు వందల సంఖ్యలో తరలి వచ్చి సమస్యలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు చేయూతనిచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలను ఇప్పించి నిరుపేదలైన బ్రాహ్మణులకు అండగా నిలవాలని సూచించారు. ఇటీవల కొందరు సినిమా వాళ్లు బ్రాహ్మణులను పదే పదే కించపరుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కేవలం డబ్బు కోసం మనోభావాలను రెచ్చగొట్టడం మంచిది కాదని హితవు పలికారు. ప్రతి పేద విద్యార్థికి బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రాహ్మణ వైదిక భవనాన్ని అందరం కలిసి కట్టుగా నిర్మించుకుందామని తీర్మానించారు. రానున్న రోజుల్లో ఎటువంటి బేధాలు పొడచూపకుండా బ్రాహ్మణుల అభివృద్ధిపైనే దృష్టి సారించాలని సూచించారు. అంతకు ముందు సాగిన సామూహిక వేద పఠనం భక్తిభావాన్ని పెంచింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు ద్వారకానాథ శాస్త్రి, హోసూరు రామసుబ్రహ్మణ్యం, ఏఎల్ఎన్ శాస్త్రి, సత్యనారాయణ, నార్పల మారుతి, కరణం రామసుబ్బారావు, జోస్యుల సదానంద శాస్త్రి, వాసుదేవశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు

'ఆయుధం లాంటి మనిషి' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: పాఠకుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే పుస్తకంగా లోసారి సాహిత్యం సాగుతుండటం అభినందనీయమని వక్తలు అన్నారు. ప్రముఖ కవి, విజయవాడ అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్ కవితా సంపుటి 'ఆయుధం లాంటి మనిషి' పుస్తక పరిచయ సభ ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ప్రగతి నేతృత్వంలో జరిగిన పుస్తక పరిచయ కార్యక్రమంలో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, డీఎస్పీ శివారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు పుస్తక విశిష్టత గురించి మాట్లాడుతూ.. సామాజిక స్పృహతో కులమత, ప్రాంతీయతకు దూరంగా ఉండే మనిషి పెంచుకోవాల్సిన సోదర భావం గురించి పుస్తకం చెబుతుందని కొనియాడారు. పోలీసు అధికారిగా సమర్థవంతమైన సేవలందిస్తూనే మరోవైపు కవితా సామర్థ్యాన్ని చాటుకుంటూ ప్రజల సమస్యలను కవిత్వంలో పలికిస్తున్న తీరు లోసారి సుధాకర్ విలక్షణతగా పేర్కొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

కారు దగ్ధం.. ప్రయాణికులు క్షేమం

నల్లమాడ: ప్రయాణిస్తున్న కారులో ఉన్నపళంగా మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న వారు అప్రమత్తమై కిందకు దిగిన వెంటనే కారు పూర్తిగా దగ్ధమైపోయింది. కదిరి ఫైర్ ఆఫీసర్ సుబహాన్ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లమాడ మండలం చారుపల్లి పంచాయతీ సి.రెడ్డివారిపల్లికి చెందిన వెంకటశివారెడ్డి అనంతపురంలో ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. బంధువులకు చెందిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం భార్య అనిత (ప్రభుత్వ ఉపాధ్యాయురాలు), కుటుంబ సభ్యులు కేశవరెడ్డి, వసుంధరతో కలిసి ఏపీ39ఎల్ఎం 4541 నంబరు గల కారులో స్వగ్రామం వచ్చారు. ఆ రాత్రికి అక్కడే ఉండి ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెంకటశివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం బయల్దేరారు. అలా సి.రెడ్డివారిపల్లి నుంచి కిలోమీటరు దూరం వెళ్లగానే కారు బానెట్‌లోంచి మంటలు వచ్చి దట్టమైన పొగలు రావడంతో వెంటనే అందులోని వారంతా కిందకు దిగి దూరంగా వెళ్లారు. కొద్దిసేపటికే కారు మంటలు పూర్తిగా వ్యాపించి దగ్ధమైంది. సమాచారం అందుకున్న కదిరి ఫైర్ ఆఫీసర్ సుబహాన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు కారు యజమాని వెంకటశివారెడ్డి తెలిపారు.



దగ్ధమవుతున్న కారు

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: అధిక వడ్డీ వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఓసీ సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శింగం సదాశివ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అధిక వడ్డీలు–ఆత్మహత్యలు అన్న అంశంపై చర్చ వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజక వర్గంలో కూడా అప్పు చెల్లించ లేదనే కారణంతో మహిళను చెట్టుకు కట్టేసి కొట్టినా చర్యలు తీసుకోలేదన్నారు. అనంతపురంలో వడ్డీ వ్యాపారులు ఒక మాఫియాగా ఏర్పడి అధిక వడ్డీకి డబ్బు ఇచ్చి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత

అనంతపురం కల్చరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా జిల్లాకు ఎనలేని సేవలందిస్తున్న ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు)ను కాపాడుకోవడం అందరి బాధ్యత అని డాక్టర్ వైఎస్సార్ స్మారక పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత శాంతినారాయణ అన్నారు. ఆదివారం జిల్లాలోని వివిధ సాహిత్య సంస్థల తరఫున రచయితలు, కవులు, కళాకారులు ఆర్డీటీకి సంఘీభావంగా ఫ్లెక్సీలు, ప్లకార్డులు పట్టుకుని మానవహారం నిర్వహించారు. ఆర్డీటీని కాపాడుకుందాం అని నినాదాలు చేశారు. నగరంలోని టవర్‌క్లాక్ వద్ద జరిగిన సంఘీభావ ర్యాలీలో సీనియర్ రచయితలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని కోరారు. ఎన్నో సేవా కార్యక్రమాలతో ఆర్డీటీ జిల్లా వాసులకు విద్యా, వైద్య, సేవా రంగాల్లో అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సంస్థ సేవలు కొనసాగేలా అందరూ బాధ్యతగా సంఘీభావం తెలియజేయాలన్నారు. జిల్లాలో ఆర్డీటీకి మద్దతుగా సాగే ప్రతి కార్యక్రమానికి రచయితల, కవుల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాషా, మహాబోధి కృష్ణమూర్తి, జూటూరు షరీఫ్, వన్నప్ప, అశ్వర్థరెడ్డి, రియాజుద్దీన్, టీవీరెడ్డి, రాయుడు, మధురశ్రీ,, విశ్వనాథరెడ్డి, గో.రా. పాల్గొన్నారు.



టవర్‌క్లాక్ వద్ద మాట్లాడుతున్న రచయితలు, కవులు

నవ భారత నిర్మాత అంబేడ్కర్

రాప్తాడు: నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడని విగ్రహ దాత, ప్రొఫెసర్ సాకే రాజేష్ కుమార్ అన్నారు. ఆదివారం రాప్తాడులో భీమ్ రావ్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి విగ్రహాలు పెట్టుకునేటప్పుడు కులమత, రాజకీయాలకు అతీతంగా అందరూ కలసి రావాలన్నారు. ఇదే గ్రామంలో వాల్మీకి విగ్రహానికి రూ.4.50 లక్షలు విరాళం ఇచ్చానని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి రూ.7 లక్షలు విరాళంగా అందజేయడం జరిగిందన్నారు. చాలా మంది దాతల సహకారంతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశ పురోగతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి అని వైస్ ఎంపీపీ రామాంజనేయులు కొనియాడారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాల్, భీమ్ రావు యువజన సంఘం అధ్యక్షుడు కటిక జయరాం, వైస్ ప్రెసిడెంట్ బాల నాగేంద్ర, ట్రెజరర్ ఓబులేస్, సెక్రటరి నాగప్ప, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, జై భీమ్ రావు అనంతపురం, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు నరేష్, వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, మాజీ డీలర్ లక్ష్మన్న, మాజీ మండల కన్వీనర్ శేఖర్, పూజారి ఓబులయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా జాతీయ గణాంకాల దినోత్సవం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం ఆధునిక గణాంక వ్యవస్థ పితామహుడు ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణాంకాల దినోత్సవం నిర్వహించారు. దేశ నిర్మాణం, విధాన రూపకల్పనలో గణాంకాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పర్యావరణం, ఆర్థిక ప్రణాళికల్లో గణాంకాలు కీలకమని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ.. డేటా సైన్స్‌ను తమ వృత్తిపరమైన కెరీర్లుగా స్వీకరించడానికి గణాంకాలు ప్రేరేపిస్తాయన్నారు. ఏఓ శ్రీనాథ్, గణాంక విభాగ అధ్యాపకులు ఎం.శివశంకర్, గణిత అధ్యాపకుడు సి.రవికుమార్ పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.40 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.40 లక్షల ఆదాయం వచ్చినట్లు సెక్రటరీ గోవింద్ తెలిపారు. శనివారం జరిగిన గొర్రెల సంత ద్వారా రూ.2.19 లక్షలు, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1.20 లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

అనంతపురం: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న దేరంగుల హేమలత (19) ఆచూకీ కనుక్కుని ఆమె బంధువులకు అప్పగించారు. టూ టౌన్ సీఐ శ్రీ కాంత్ యాదవ్ తెలిపిన వివరాలు.. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం పట్నం గ్రామానికి చెందిన దేరంగుల హేమలత అనంతపురం నగరంలో ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు వెళ్తోంది. తన మేనమామ మందలించాడనే కారణంతో శనివారం రాత్రి అదృశ్యమైంది. హేమలత తాత ఆదివారం సాయంత్రం 3 గంటలకు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాడిపత్రి పోలీసుల సాయంతో యువతి ఆచూకీ కనుక్కుని ఆమె బంధువులకు అప్పగించారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న ఉప్పర లలిత అనే మహిళ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తుండటంతో ఆమెపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సిబ్బంది రైడ్ చేసి ఒక బాధితురాలిని కాపాడినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టులో ఆరుగురికి చోటు

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మహిళల రాష్ట్ర జట్టులో అనంతపురం నుంచి ఆరుగురు క్రీడాకారిణులకు చోటు దక్కింది. బి.నేహ, డి.చంద్రిక, ఎస్.తరున్నమ్, ఏ.హన్సిరెడ్డి, బి.తేజశ్విని, బి.హిమ వర్షిణి జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. బి.నేహ అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. కుడి చేతి ఓపెనర్ బ్యాట్స్‌మెన్. ఆంధ్ర అండర్-19లో (వన్డే) సత్తా చాటింది. ఒక అర్ధ సెంచరీతో పాటు మొత్తం 325 పరుగులు చేసింది. డి.చంద్రిక తపోవనం క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందింది. కుడిచేతి లెగ్ స్పిన్నర్. ఆంధ్ర అండర్-15 ఉమెన్ జట్టులో స్థానం పొందారు. అండర్-19 సౌత్ జోన్‌లో ఐదు వికెట్లు తీసి సత్తా చాటారు. కదిరికి చెందిన బి.తేజశ్విని.. కుడి చేతి మీడియం పేస్ బౌలర్. ఆంధ్రా అండర్-15 ఉమెన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. గుంతకల్లుకు చెందిన ఎస్.తరుణ్ణమ్ కుడి చేతి మీడియం పేస్ బౌలర్. అనంతకు చెందిన ఏ.హన్సి రెడ్డి అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందింది. తపోవనం క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందిన బి.హిమవర్షిణి వికెట్ కీపర్‌గా రాణిస్తోంది.

10వ రోజుకు చేరిన సమ్మె



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగరపాలక సంస్థ ముందు చేపడుతున్న సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరింది. ఉద్యోగ భద్రత కల్పించడంతో, కార్మికులకు వేతనాలు పెంచడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు మోకాళ్లపై నిరసన తెలియజేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.భాస్కర్ రెడ్డి, లోకేష్ నాయుడు, సూర్యనారాయణ, పుల్లయ్య, నూర్‌బాషా, సురేష్ బాబు, కుళ్లాయప్ప, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొలువుదీరనున్న పీర్లు

ఆత్మకూరు: కుల మతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరులో సోమవారం పీర్ల స్వాములను కొలువుదీర్చనున్నారు. సోమవారం రాత్రికి పెట్టి మెరవణి అనంతరం చదివింపులు చేసి పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీరుస్తారు. 2వ తేదీ పీర్లకు వెండి ఆభరణాల అలంకరణ, 4న చిన్న సరిగెత్తు, 5న విడిదినం, 6న పెద్ద సరిగెత్తు, 7వ తేదీ తెల్లవారుజామున పీర్లకు గ్రామోత్సవం నిర్వహించి సాయంత్రం జలధికి తరలిస్తారు. 9న స్వామి వారి చివరి దర్శనం ఉంటుంది.